# ప్చ్.. విధి బలీయమైనది...

-డా.ప్రసాద్ కల్లూరి

"ఏంటా కలపడం? ఇంకొంచెం పెరుగు వేసుకోండి" అంటూ మరి కాస్త గడ్డ పెరుగు కంచంలో వడ్డించిన ఆండాళ్ళు వంక కన్నార్పకుండా చూసాడు అచ్యుత్.

'అహో... ఏమిటీ విచిత్రము? ఏనాడూ లేనిది మదీయ భార్యామణి ఇంతలా అభిమానమును ఒలకబోయుట మిక్కిలి అచ్చెరువుగనున్నదే' అనుకుంటూనే భోజనం ముగించాడు.

వాష్‌బేసిన్ దగ్గర చేయి కడుక్కుని వస్తున్న అచ్యుత్‌కు వయ్యారంగా టవల్ అందించింది ఆండాళ్ళు. మళ్లీ అచ్యుత్ మదిలో ఆవిర్భవించింది అబ్బురపరిచే గ్రాంధిక భాష.

'సందేహము వలదు.. తప్పక మదీయ అర్ధాంగి ఏ టీవీ సీరియల్‌నో వీసమైనా వదలకుండా వీక్షించినది కాబోలు... అందుచేతనే ఈ విపరీత అనూహ్యా ప్రవర్తన' అనుకున్నాడు అచ్యుత్.

"ఏవండీ మీరు కాదననంటే ఓ విషయం అడగాలి" వక్కపొడి అందిస్తూ వగలుబోయింది.

"సంగతేంటో చెప్పు" రాబోయే సునామీ ఏ స్థాయిలో వుంటుందో ఊహించే ప్రయత్నం చేస్తూ అన్నాడు అచ్యుత్.

"అబ్బే... పెద్ద విషయమేదీ కాదు. ఈవేళ మధ్యాహ్నం కాస్త షాపింగ్‌కి వెళ్లాలి. ఓ రెండు వేలు ఇవ్వరూ" అనునయంగా అడిగింది ఆండాళ్ళు.

అదిరిపడ్డాడు అచ్యుత్.

సడెన్‌గా అంత డబ్బు అడిగేసరికి గుండె ఆగినంత పని అయ్యింది. కానీ తప్పని పరిస్థితి.

ఒకటీ... అడిగింది ఆమె పుట్టినరోజున.

ఇంకొకటీ... ఏనాడూ నోరు తెరిచి తనను ఆమె డబ్బు అడగలేదు. ఇవ్వక తప్పలేదు.

మరు నిముషం జరిగిందో అనూహ్యా సంఘటన. ఠక్కున అచ్యుత్ పెదాలమీద ఫ్రెంచ్ కిస్ ఇచ్చింది ఆండాళ్ళు. అవాక్కయ్యాడు అచ్యుత్.

అదృష్టం బాగుండి ఆ ముద్దు సీను అచ్యుత్ కన్నతల్లి 'కం' ఆండాళ్ళు మేనత్త అయిన భ్రమరం చూడలేదు. లేకపోతే ఆ ఆరోజు మరో సునామీ చూడాల్సి వచ్చేది. ఇదిలా వుంటే?

అచ్యుత్‌కి అంతుబట్టని మరో విషయం చోటు చేసుకుంది. అప్పటివరకూ సప్తగిరి ఛానెల్ న్యూస్‌రీడర్‌లా భావరహితంగా ఉండే తన అర్ధాంగి ఆండాళ్ళు అమాంతం యం టీవీ ఛానెల్‌లోని యాంకర్లా రెచ్చిపోయి ముద్దివ్వడం. అసలేమి జరుగుతుందో అర్ధంకాలేదు అచ్యుత్‌కి.

ఆ విషయాన్ని గురించి మరికొంత ఆలోచించేవాడేగానీ ఆఫీస్‌లో అర్జంటు పని ఉండడంతో హడావుడిగా బయలుదేరాడు.

★★★

ఆ సాయంత్రం కాళ్లీడ్చుకుంటూ వరండాలో అడుగుపెట్టిన అచ్యుత్‌కి సాదరంగా ఆహ్వానం పలికాయి అరవై జతల ఆడ చెప్పులు.

పరిస్థితి ఏం అర్ధం కాలేదు.

ఆ సాయంకాలంవేళ అంతమంది మహిళామణులు ఎందుకు వేంచేసినట్టు? పోనీ ఏదైనా పేరంటమో, నోమో అనుకోవడానికి తనకు తెలిసి అటువంటి సందర్భం ఏమీలేదాయె.

అతికష్టంమీద దారి చేసుకుంటూ బెడ్రూంలోకి చేరుకున్నాడు అచ్యుత్. అదృష్టంకొద్దీ ఫ్రెషప్ అయి వచ్చేసరికి టీపాయ్ మీద ప్లేట్లో సమోసా, ఫ్లాస్క్‌లో టీ సిద్ధం. హాల్లోలోంచే సైగ చేసింది ఆండాళ్ళు ఆరగించమని. అక్షరాలా పాటించి రిలాక్సయ్యాడు అచ్యుత్. అసలు విషయమేమిటో తెలుసుకోవాలని చాలా ఆత్రంగా ఉంది. హాల్లో జరిగే సంభాషణలు మాత్రం సగం నుంచి చూసిన టీవీ సీరియల్‌లా ఏమీ అర్ధం కావడంలేదు.

హడావుడి సద్దుమణిగేసరికి పదకొండు గంటలైంది. అప్పటికి మన స్పృహలోకి వచ్చింది ఆండాళ్ళు.

"ఏమండీ... భోజనం కాస్త ఆలస్యమయింది. అరగంటలో వంటచేసి పెడతాను" అంటూ హడావుడి పడిపోయింది ఆండాళ్ళు.

"అదికాదు ఆండాళ్ళు వున్నట్లుండి మన ఇంట్లో ఈ హంగామా ఏమిటి? ఏదైనా నోములాంటిది నోచుకున్నావా?" ప్రశ్నల పరంపర వెలువడింది అచ్యుత్ నోటి నుండి.

"అయ్యో నా మతిమండా! అసలు విషయం మీకు చెప్పలేదుకదూ? ఈ రోజు మన సీత సీమంతమండీ. అందుకని అరవైమంది ముత్తయిదువలకు జాకెట్టు గుడ్డా, కిలో సున్నుండలూ, తాంబూలంతో పాటు వెండి కుంకుమభరిణె పంచి పెడతానని కనక మహాలక్ష్మికి మొక్కుకున్నాను. అదిసరేగానీ ముందు భోజనం చేయండి. మిగతా వివరాలు తరువాత చెప్తాను" అంటూ భోజనం వడ్డించింది ఆండాళ్ళు.

అన్యమనస్కంగానే అయిందనిపించాడు అచ్యుత్. వంటిల్లు సర్దే పనిలో మునిగిపోయింది ఆండాళ్ళు. సోఫాలో రిలాక్సయిన అచ్యుత్‌ను మాత్రం ఒక ప్రశ్న వేధించసాగింది.

తనకు తెలియని ఈ కొత్త క్యారెక్టర్ సీత ఎవరు? తమ ఇంట్లో ఆమె సీమంతం సందర్భంగా ఫంక్షన్ చేయడం. ఏమిటి? అది కూడా అంత భారీగా! ఆండాళ్ళు పనంతా ముగించుకుని పడకటిల్లు చేరేసరికి పన్నెండయింది. తన బుర్రను తొలుస్తున్న సందేహాన్ని తీర్చుకోకుండా విశ్రమించకూడదన్న పట్టుదలతో, ఏదో మేగజైన్ తిరగేస్తూ మేల్కొనే ఉన్నాడు అచ్యుత్. ఆండాళ్ళు లోనికి అడుగుపెట్టడం ఆలస్యం తన సందేహాన్ని వ్యక్తం చేసాడు. మంచం అంచున కూర్చుంటూ గొంతు సవరించుకుంది ఆండాళ్ళు.

"కాదండీ... మన సీత మీకు తెలుసుకదా? అదే రఘుపతి భార్య" వెర్రివాడా నీకు జి.కె.నిల్ అన్నట్లు మొహం పెట్టింది ఆండాళ్ళు.

అచ్యుత్ కన్‌ఫ్యూజన్ మరింత పెరిగింది తనకు పరిచయం ఏమాత్రం లేని మరో క్యారెక్టర్ వచ్చి చేరినందుకు.

"చూడు ఆండాళ్లూ! నువ్వు చెబుతున్న సంగతి ఆర్ట్ సినిమాలా అరంగుళం కూడా అర్ధం కాలేదు.ఈ రఘుపతి, సీత వీళ్లంతా ఎవరు? మీ తరపున మనకు దూరపు బంధువులా?" అమాయకంగా మొహం పెట్టి అడిగాడు అచ్యుత్.

ఆండాళ్ళు నాన్‌స్టాప్‌గా నవ్వసాగింది. ఎంతసేపు నవ్విందంటే 'ఏదైనా డ్రగ్ తీసుకోలేదుకదా?' అనుకున్నాడు అచ్యుత్.

అంత హిస్టీరిక్‌గా ఉంది ఆ నవ్వు.

"అయ్యో! శ్రీవారూ జాగ్రత్తగా వినండి. నా పోరు భరించలేక నాతోపాటు జీబ్రా టీవీ ఛానెల్‌లో ప్రఖ్యాత వ్యక్తి మన దుష్మన్ రచించి, బూతుపా

టలు రాసి ముష్టిబొమ్మలు వేసి గార్ధభ సంగీతం అందించిన 'యమవ్యూహం' అనే జీడీపాకం సీరియల్ మీరు చూసారుగా? ఆ సీరియల్ పుణ్యమాని పదిమందికి బ్రైన్ ట్యూమర్ వచ్చిందని మీకు చెప్ప లేదూ?" అంది ఆండాళ్ళు.

అచ్యుత్‌కి ఏమీ అంతుబట్టలేదు. తను ప్రస్తావన చేసిన విషయాలకు ఆ బ్రైన్ ఈటింగ్ సీరియల్‌కి సంబంధం అంతుబట్టలేదు.

"ఇంతకూ అసలు విషయం ఏమిటే?" చిరాకు పడ్డాడు అచ్యుత్.

"అయ్యో రాతా! ఆ సీరియల్‌లో మెయిన్ క్యారెక్టర్ అండీ మన సీత. ఆమె భర్త రఘుపతి" గీతాచార్యుడిలా స్టిల్ ఇచ్చి చెప్పింది ఆండాళ్ళు. ప్రపంచమంతా గిర్రున తిరిగినట్టు అనిపించింది అచ్యుత్‌కి.

"ఈ రోజు సాయంత్రం ఎపిసోడ్‌లో సీతకు సీమంతమండీ. ఆ ఆనందాన్ని సాటి స్త్రీగా నలుగురితో పంచుకోకపోతే ఎలా చెప్పండి? అందుకే సీతకి మద్దతుగా మహిళామండలి సభ్యులందరినీ మన ఇంటికి పిలిచి తలా ఒక రవికె గుడ్డ, అరకిలో అప్పాలు, ఒక వెండి కుంకుమభరిణె పంచి పెడదామని మొక్కుకున్నానండి. ఇంకో విషయం తెలుసా? నేను దుష్మన్‌గారికి స్వయంగా ఫోన్ చేసి ఈ విషయం తెలియజేసాను. ఆయన ఎంత సంతోషపడ్డారో తెలుసా? పైగా నాలాంటి వీరాభిమానులు వుండబట్టే తమ సీరియల్స్‌కి లాంగెవిటీ చేకూరుతుందిట. ఇంత గుండె నిబ్బరంతో తన సీరియల్ చూసి ఏమీ అఘాయిత్యం చేసుకోకుండా ఉన్నందుకు నన్ను అభినందించారు కూడా."

అసలు తన ఇంట్లో ఏం జరుగుతోందో అర్థంకాలేదు అచ్యుత్‌కి. ఏదో కాలక్షేపం కోసం 'యమవ్యూహం' చూస్తోందని అనుకున్నాడు అచ్యుత్.

అంతేకానీ ఇలాంటి పైత్య వికారపు చేష్టలు తన శ్రీమతి చేస్తుందని ఏనాడూ ఊహించలేదు. ఏమన్నా అందామంటే అయిన సంబంధం. పైగా ఆండాళ్ళు పూర్తిగా అత్తగారి సపోర్ట్‌తోనే రెచ్చిపోతోందని తెలుసు. తనవైపు పిచ్చి చూపులు చూస్తున్న భర్త భుజాలను పట్టి కుదిపింది ఆండాళ్ళు. స్పృహలోకి వచ్చాడు అచ్యుత్.


ఓ వెర్రినవ్వు నవ్వి అటువైపు తిరిగి పడుకున్నాడు నిద్ర వస్తోందంటూ.

★★★

ఎప్పుడూ గలగలా మాట్లాడే అచ్యుత్ మరునాటినుండి చాలా ముభావంగా ఉండడాన్ని జీర్ణించుకోలేకపోయింది ఆండాళ్ళు. అడిగే ధైర్యం చేయలేకపోయింది. ఆఫీసులోనూ అదే పరిస్థితి.

వర్క్‌తప్ప ఏ ఇతర విషయాన్నీ అతను పట్టించుకోకపోవడం సదరు మేనేజర్ మదన్‌కి మింగుడు పడలేదు. చదివే రోజుల్లో యూనివర్సిటీలో అచ్యుత్‌కి కేవలం సంవత్సరం మాత్రమే సీనియర్ మదన్. ఆ సంస్థ తన మామగారిది కావడం చేత సరాసరి మేనేజర్ అయ్యాడు మదన్. వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితులు అవడంచేత ఏనాడూ అచ్యుత్‌ని ఒక సబార్డినేట్‌గా చూడలేదు మదన్.

మనసాపుకోలేక ఆ సాయంత్రం స్టాఫంతా వెళ్ళిన తరువాత అచ్యుత్‌ని తన రూంకి పిలిపించాడు మదన్.



"అచ్యుత్! ఈక్షణంలో నేను నీ బాస్‌లా కాకుండా ఒక ఆత్మీయునిగా అడుగుతున్నాను. గత వారంరోజులుగా నువ్వు చాలా మూడీగా ఉండడం గమనించాను. నాకు తెలిసి మన ఆఫీసులో నిన్ను ఇబ్బంది పెట్టే సమస్య ఏదీ లేదనుకుంటాను. ఎంతో చలాకీగా ఉండే నువ్వు ఇలా ఉండడం ఎంతో బాధ కలిగిస్తోంది.ఒక ఆప్త మిత్రునిగా నేను చేయగలిగిన సాయం ఏదైనా ఉంటే చెప్పు తప్పక చేస్తాను" అన్నాడు.


మదన్ అంత ఆప్యాయతతో అడిగేసరికి అచ్యుత్ పసిపిల్లవాడిలా బావురుమన్నాడు. "ఛ... ఏంటిది చిన్నపిల్లాడిలా" అనునయించాడు మదన్.

"మొహమాటం లేకుండా చెబుతాను విను.నా బ్రతుకు చీకటైపోయింది. విధి నాపై పగబూనింది. గ్రహాలన్నీ కూడబలుక్కుని నామీద కక్ష సాధిస్తున్నాయి" ఎమోషనల్‌గా అన్నాడు అచ్యుత్.  ఒళ్ళు మండిపోయింది మదన్‌కి.

"దిక్కుమాలిన డైలాగులు చెప్పావంటే మంచిరోజు చూసి నిన్ను మర్డర్ చేయిస్తా.ఇంత విషాదంలో కూడా నీ దిక్కుమాలిన సెన్స్ ఆఫ్ హ్యూమర్ ప్రదర్శించాలన్న దురద దేనికి? మానవ భాషలో చెప్పి తగలడు" అన్నాడు మదన్.


అంతే! అక్షరం పొల్లు పోకుండా అంతా ఏకరువు పెట్టాడు అచ్యుత్.

"అంటే నువ్వు మా చెల్లెలి వీర టీవీ అభిమానానికి బలైపోతున్న సగటు బకరావయ్యావన్నమాట. సరే నాకో వారం రోజులు టైమ్ ఇవ్వు. ఏదో ఒక ఉపాయం ఆలోచిస్తా" అంటూ అచ్యుత్ భుజం తట్టి పంపించాడు మదన్.



## ఆశ్చర్యం

ఎప్పుడు ఖాళీ దొరికినా బుక్స్ చదవడం మీద దృష్టిని కేంద్రీకరిస్తారు కొందరు. మంచి పుస్తకం మంచి స్నేహితుడికన్నా విలువైనదంటోంది అందాలతార విద్యాబాలన్. ఎనిడ్ బ్లైటన్ బుక్స్ అంతే తనకెంతో ఇష్టమని చెప్పే ఈ భామ ఈమధ్యే హిందీ అక్షరమాలతో అందంగా రూపొందించిన ఓ పుస్తకాన్ని విడుదలచేసింది. షాపింగ్ కోసం ఎక్కడికెళ్లినా మంచి మంచి పుస్తకాలతో ఆమె బయటకు రావడం ఆమె మిత్రుల్ని ఆశ్చర్యపరుస్తుందిట.




***

"ఆండాళ్లుగారు... మీరేనాండీ" ఎదురుగా వున్న వ్యక్తి అడిగిన ప్రశ్నకు అవునన్నట్లు తలూపింది.

"మేడం! నేను అచ్యుత్‌గారి ఆఫీసులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేసే పరాంకుశం. మీతో పర్సనల్‌గా మాట్లాడాలి" అన్నాడు సదరు వ్యక్తి.

"మావారు ఇంకా ఇంటికి రాలేదండీ" విషయం ఏమిటో అర్థంకాక రొటీన్ డైలాగ్ చెప్పింది ఆండాళ్లు.

"నేను మీతోనే మాట్లాడాలండీ. ఓ పదినిముషాలు చాలు. నన్ను మా యండీ మదన్‌గారు పంపించారు" అన్నాడు.

మదన్ పేరు వినేసరికి అది తప్పక ముఖ్యమైన విషయం అయి వుంటుందని లోపలికి రమ్మంది. "చూడండమ్మా! కొన్ని పరిస్థితుల్లో మనం గుండె నిబ్బరం చేసుకోవాలి. అన్నిరోజులూ మనవి కావు.మనుషులకు కాకపోతే మానులకు కష్టాలు రావుకదా" అన్నాడు పరాంకుశం.

ఆండాళ్ళుకు ఏదో అపశకునం జరుగుతున్నట్లుగా తోచింది.

"అసలేం జరిగిందో చెప్పండి" ఆదుర్దాగా అడిగింది ఆండాళ్ళు.

"మీరు ధైర్యంగా ఉండండి. మీ పరిస్థితుల్లో ఎవరున్నా మా యండీ మదన్‌గారు తప్పక ఆదుకుంటారు" అనునయించాడు పరాంకుశం.

"మావారికేమయిందో చెప్పకుండా ఈ సోది చెప్తారేంటి?" ఈమారు ఆండాళ్లు ఆందోళన అసహనంగా మారింది.

"అచ్యుత్‌గారు సడెన్‌గా హిస్టీరిక్‌గా మారిపోయారు. ఈ మధ్యాహ్నం మూడుగంటలకు టీ సర్వ్ చేసిన అటెండర్ గొంతు పిసకబోయారు. 108కి ఫోన్ చేసి యర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌కు పంపించాము. వారంరోజులపాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలట.మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే అచ్యుత్‌గారు చాలా కోపంగా ఉన్నారు కనుక మనెవ్వరినీ వారందాకా కనబడవద్దని చెప్పారు" చావు కబురు చల్లగా చెప్పాడు పరాంకుశం. అవాక్కయింది ఆండాళ్లు.

'అసలేం జరిగింది? అచ్యుత్ హిస్టీరిక్‌గా మారడానికి కారణం ఏమిటి?' ఇలా పరిపరివిధాలుగా ఆలోచించసాగింది.

"మేడం! మా యండిగారు మీకు ఈ కవరు ఇవ్వమన్నారు" అంటూ ఓ సీల్డు కవరు అందించిన పరాంకుశం మెల్లగా అక్కడినుంచి జారుకున్నాడు.

కవర్ చించి లోపలవున్న ఉత్తరాన్ని భయం భయంగా బయటకు తీసింది ఆండాళ్ళు. అది అచ్యుత్ వ్రాసిన ఉత్తరం. చదవసాగింది.

"గౌరవనీయులైన యం.డి.గారికి,

నమస్కారములు.

నా మానసిక పరిస్థితిని దృష్టిలో వుంచుకుని ఏ రోజైనా ఈ ఉత్తరం అవసరపడుతుందని తెలిసి ముందుగానే వ్రాసి సీల్డు కవర్లో నా టేబుల్ సొరుగులో ఉంచాను. నాకు ఏదైనా జరగరానిది జరిగితే దయచేసి ఈ ఉత్తరాన్ని నా అర్ధాంగి అయిన ఆండాళ్లుకు అందించండి. సార్! అప్పుచేసి బాధపడ్డవారిని మీరు చూసి వుండవచ్చు. అనారోగ్యంతో మంచం పట్టినవారిని చూసి ఉండవచ్చు.కానీ ఇల్లాలి విపరీత ప్రవర్తన వల్ల బాధ పడుతున్న నావంటివారిని చూసి ఉండరు. ఆ అవిడ ఆండాళ్ళు నిజంగా మహాసాధ్వి. కానీ... ఆమెకున్న బలహీనత దుష్మన్ సీరియల్స్‌ను అనితరసాధ్యమైన ఆసక్తితో చూడడమే కాక అందులోని సన్నివేశాలకు అనుగుణంగా సంతర్పణలు చేయడం. మొన్నటికి మొన్న అదెవరో దుష్మన్‌గాడి సీరియల్‌లో సీతట. ఆ పిచ్చికుంక సీమంతం సీను చూసి ఉద్రేకపడిపోయి అరవైమంది ముత్తయిదువులకు వెండి కుంకుమ భరిణెలు,

స్వీట్లు, నా శ్రాద్ధం, పిండాకూడు కలిపి దాదాపు మూడువేలు తగలేసింది. విషయం ఇదని ముందుగా తెలిస్తే చచ్చినా ఇచ్చేవాడిని కాదు. ఈరోజు సీరియల్‌లో పాత్రకు సీమంతమైతేనే రెచ్చిపోయిన మా ఆవిడ రేపు దాని పురిటికి కొంప అమ్మినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

సార్! నాదో చిన్న కోరిక. ఒకవేళ నాకు మతి భ్రమించినా లేదా ఏ హార్ట్ అటాక్‌తో నేను టపీమన్నా నాకు వచ్చే బెనిఫిట్స్ అన్నీ ఫిక్సెడ్స్‌లో వేసి కేవలం వడ్డీ మాత్రం ఆండాళ్ళు తీసుకోగలిగే ఏర్పాటు చేయండి. లేకపోతే కొంప కొల్లేరవుతుంది. రేపు ఈ దుష్మన్‌గాడే ఏ జలగండం సీరియల్ తీయడం మొదలు పెడితే నన్ను నాశనం చేసినట్లు ఇంకొంతమందిని ఆ సీరియల్ బలి తీసుకుంటుంది. అదీ వాడి లెగ్గు మహిమ. పైగా అతను పెంచి పోషిస్తున్న వందిమాగధులవంటి ఘోస్ట్ రైటర్స్, చీము నెత్తురులేని ఆర్టిస్టులు వున్నంతవరకు సగటు మహిళా ప్రేక్షకులకు ఈక్షోభ తప్పదు.పైగా అతని పైత్య ప్రకోపాన్ని పాండితీ ప్రకర్షగా ప్రశంసించే సీనియర్ నటులు కోకొల్లలు. అందుకే మతి తప్పకముందే నేను వ్రాసుకుంటున్న 'మరణ' సందేశమిది. ఒకవేళ అదృష్టం బాగుండి నేను తనువు చాలిస్తే ఎలాగైనా ఈ జానీ దుష్మన్ విషపు సీరియల్ కోరల నుండి ఆంధ్ర మహిళా లోకాన్ని రక్షించండి. సార్! మరు జన్మంటూ వుంటే బుల్లితెర అనే భూతం అడుగుపెట్టని ఏ ఆఫ్రికా అంతర్భాగంలోనో, మనుషులు మసలని మాల్దీవులలోని అనాక్రమిత ద్వీపంలోనో జన్మించి ప్రశాంతంగా జీవించాలని బలమైన కోరిక. ఇంతటితో ముగిస్తున్నాను.

ధారావాహిక బాధాతప్త హృదయుడు
అచ్యుత్

చదవడం ముగించిన ఆండాళ్లుకు కళ్లముందు గాఢాంధకారం అలుముకుంది. అంటే... కేవలం తన బుల్లితెర పిచ్చితో కట్టుకున్న భర్తను మతి స్థిమితం తప్పి మరణాన్ని స్వాగతించే స్థితికి తెచ్చిందన్నమాట. ఎంత పని అయింది. కాలక్షేపానికి చూడడం మొదలిడిన సీరియల్స్‌ని, జీవితంలో భాగం చేసుకుని విపరీత ప్రవర్తన అలవర్చుకున్నందుకు ఎంతో సిగ్గుపడింది. అంతా స్వయంకృతం అనుకుంది. చేతిలోని ఉత్తరం పక్కనపెట్టి శుభ్రంగా కాళ్లు చేతులు కడుక్కుని పూజగదిలోని దేవుని పటాల ముందు సాగిలబడి అచ్యుత్‌ని రక్షించమని భగవంతుడ్ని వేడుకుంది. ముడుపు కట్టుకుంది. వెంటనే సెల్ అందుకుని యండికి ఫోన్ చేసింది.

"సార్! నేను చేసిన పొరపాటు ఏమిటో తెలుసుకున్నాను. ఇంకెప్పుడూ నా సీరియల్ పిచ్చితో మావారిని క్షోభపెట్టను. దయచేసి మంచి ట్రీట్‌మెంట్ ఇప్పించి తిరిగి ఆయన మామూలు మనిషయ్యేలా చూడండి. మీ మేలు ఈజన్మలో మరచిపోను'' ఎంతో ఎమోషనల్‌గా చెప్పింది ఆండాళ్ళు.

"అలాగేనమ్మా. నా శక్తిమేరకు చికిత్స చేయిస్తాను. ఆపై ఆపైవాడి దయ'' ముక్తసరిగా చెప్పి ఫోన్ పెట్టేసాడు మదన్.

***

వారంరోజులు గడిచాయి. ఒకనాటి ఉదయం, 108 అంబులెన్స్ వచ్చి ఆగింది అచ్యుత్ ఇంటి ముందు. కంగారుగా బయటకొచ్చింది ఆండాళ్ళు.

కొద్దిపాటి నీరసంతో నింపాదిగా దిగుతున్న అచ్యుత్‌ని చూసి ఆండాళ్ళు కంట నీళ్లు తిరిగాయి. దిష్టితీసి కొబ్బరికాయ కొట్టి ఇంట్లోకి పిలుచుకు వచ్చింది.

***

వారంరోజులు రెస్టు తీసుకునేసరికి నార్మల్ కండిషన్‌కు వచ్చాడు అచ్యుత్. సమయానికి తిండి, మల్టీ విటమిన్స్ మొత్తంమీద పూర్తిగా కోలుకున్నాడు.

పదిరోజుల తరువాత ఆఫీసుకు వచ్చిన అచ్యుత్‌ని తన ఛాంబర్‌కి పిలిపించాడు మదన్. అది సాయం సమయం.అందరూ డ్యూటీ ముగించుకుని వెళ్లిపోయారు. కాఫీలు తాగడం అయ్యాక అసలు విషయానికొచ్చాడు అచ్యుత్.

"సార్! మీరు చేసిన మేలు నేను ఎన్నటికీ మర్చిపోలేను.లేకపోతే నిజంగా నా బ్రతుకు యర్రగడ్డలో తెల్లవారి ఉండేది.మీకు ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో తెలియడంలేదు'' కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు.

"అచ్యుత్! ఇప్పుడు నేను మీ బాస్‌లా కాక ఒక ఆప్తుడిలా మాట్లాడుతున్నాను. ఎంతో ఎఫీషియంట్‌గా వర్కు చేసే నీవు అలా మోరోజ్‌గా వుంటే చూడలేకపోయాను.అందుకే ఓ చిన్న నాటకం ఆడి ఓ వారంరోజులపాటు మన బెంగుళూరు బ్రాంచీకి పని కల్పించి మరీ పంపించాను.కావలసిన బట్టలు మొదలుకుని అన్నీ కొత్తది కొన్నది కూడా మన ఆఫీసు డబ్బుతోనే. నేను ఇదంతా ఎందుకు చేసానో తెలుసా? మీలాంటి కమిటెడ్ ఎంప్లాయ్ మా ఆఫీసుకు ఇండిస్పెన్సిబుల్ కనుక. సరే ఇదంతా మర్చిపోదాం. నాకు తెలిసి మా చెల్లెమ్మ ఇక సీరియల్స్ జోలికి పోదనే నేను అనుకుంటాను. ఛీరప్, హ్యాపీ డేస్ ఆర్ హియర్ అగైన్'' అంటూ మనస్ఫూర్తిగా నవ్వాడు మదన్.

శృతి కలిపాడు అచ్యుత్.

★

## లోకానికి తెలియని దుస్థితి

40ఏళ్ళ జాయిస్ విన్‌సెంట్ అనే ఆమె రెండేళ్ళుగా అద్దెకట్టడం లేదేమని గతంలో తమ కంపెనీలో పనిచేసిన సాచీ అండ్ సాచీ కంపెనీవాళ్ళు ఆమె ఇంటికి వెళ్లి తలుపులు కొట్టారు. ఎంతకీ రెస్పాన్స్ లేదని పోలీసుల సహాయంతో తలుపులు బ్రద్దలు కొట్టుకుని లోపలికి వెళ్లిచూస్తే టీవీ ముందు ఆమె శవం శిధిలావస్థలో కనిపించింది. పరీక్షల్లో ఆమె చనిపోయి రెండేళ్లయిందని, ఆ టీవీ రెండేళ్లుగా అలాగే ఆన్‌లో ఉందని తేలింది.

## హౌస్ ఆఫ్ హారర్

లేక్ అల్హా ప్రాంతంలో ఏకాంతంగా 1980లలో కట్టిన ఇల్లది. 27ఏళ్ల తను ఇంట్లో కూర్చుని ఉండగా కాళ్లక్రింది భూమి కృంగి అక్కడ హఠాత్తుగా ఏర్పడిన గోతిలో పడిపోయాడు. తర్వాత మీద పడిన శిధిలాల క్రిందపడి చనిపోయాడు. ఆ ప్రాంతంలో కొన్నేళ్లక్రితం భూగర్భగనులుండేవని, వర్షాలకు ఆప్రాంతం క్రుంగిఆ ఇల్లు నేలలోకి కుచించుకుపోయింది.

## అవకతవకల మయం

పాకిస్థాన్‌లో ప్రభుత్వం నుంచి గ్రాంట్స్ తీసుకుంటున్న స్కూల్స్ అనేకం. వాస్తవంలో లేని 30వేల స్కూల్స్ డబ్బు మాత్రం తీసుకుంటున్నట్టు ఇటీవల బయటపడిందిట. పారదర్శకత లేకుండా లంచాలభరితమైన ప్రభుత్వ పరిపాలన ఉన్న ఏ దేశంలోనైనా అవకతవకలు ఇలాగే ఉంటాయని మరోసారి రుజువైంది.

-టి.ఆర్.

